క్లుప్తంగా

టమాట పంట పరిశీలన


రైతులకు సూచనలిస్తున్న హార్టికల్చర్ ఆఫీసర్ యామిని

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: ఈనెల 28న 'టమాట రైతుకు తెగుళ్ల బెడద' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం ఉద్యానవన శాఖ నియోజకవర్గ అధికారిణి యామిని కూడేరులో తెగుళ్ల బారిన టమాట పంటను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు ఏయే చర్యలు చేపట్టారని రైతులను అడిగి తెలుసుకున్నారు. మచ్చ తెగుళ్లకు 10 లీటర్ల నీటిలోకి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, 1 గ్రామం స్ట్రెప్టోమైసిన్ కలిపి వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. బూడిద తెగుళ్లకు లీటర్ నీటికి 2 ఎంఎల్ వెట్టబుల్ సల్ఫర్, పూత రాలకుండా అరికట్టడానికి లీటర్ నీటికి 2–3 ఎంఎల్ వేప నూనె కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ జాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ ఎస్ఐగా నవీన్‌కుమార్



బొమ్మనహాళ్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐగా నవీన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లాకు చెందిన నవీన్‌కుమార్ 2024–25 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ ఎస్ఐగా 5 నెలల పాటు శిక్షణ పొందనున్నారు. కొత్తగా వచ్చిన ట్రైనీ ఎస్ఐ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే విధానం.. ప్రజలతో వ్యవహరించే తీరు.. కేసుల నమోదు, దర్యాప్తు తదితర అంశాలపై శిక్షణ తీసుకునేందుకు బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చినట్లు రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.

పీహెచ్‌సీలో పాము సంచారం


పీహెచ్‌సీ ఆవరణలోని నీటి ట్యాంక్ వద్ద సంచరిస్తున్న పాము

కూడేరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లోకి పాములు వస్తున్నాయి. వైద్యం కోసం వచ్చే రోగులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. బుధవారం పీహెచ్‌సీ డోర్ నుంచి నీటి ట్యాంక్ పక్కకు సిబ్బంది ఒక్కరు వెళ్లగా పెద్ద పాము కనిపించింది. భయంతో పరుగులు తీశాడు. పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి, చెట్ల ఆకులు రాలడంతో చెత్త పేరుకుపోయింది. పిచ్చి మొక్కలు, చెత్త తొలగించి విష పురుగులు సంచరించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

చేసిన పనులకు బిల్లులు పెట్టరా?


మాట్లాడుతున్న సర్పంచ్ నాగమ్మ

కూడేరు: చేసిన పనులకు బిల్లుకు పెట్టకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండల పరిధిలోని ఉదిరిపికొండ సర్పంచ్ నాగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బిల్లులు మంజూరు చేయించుకునేందుకు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతుంటే ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయించడం జరిగిందన్నారు. ఇందుకు సుమారు రూ.60 వేలు, వీధి లైట్లు ఏర్పాటు చేయించినందుకు సుమారు రూ.80 వేలు బిల్లులు రావాల్సి ఉందని తెలిపారు. పనుల వివరాలను రికార్డు చేయించాం. కంప్యూటర్లో నమోదు చేయాల్సి ఉంది. కానీ అధికారులు నెలలు గడుస్తున్న నమోదు చేయకుండా తిప్పుతున్నారని వాపోయింది. ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

చాపిరిలో మంత్రి పర్యటన


మంత్రి పార్థసారథిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం రూరల్: చాపిరి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి హాజరయ్యారు. మంత్రి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు.

కౌన్సిల్ సమావేశంలో రసాభస

- కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి దురుసు వ్యాఖ్యలు
- తప్పుబట్టిన చైర్‌పర్సన్, మహిళా కౌన్సిలర్లు


కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. తొలుత అజెండాలోని అంశాలతోపాటు టేబుల్ అజెండా అంశాలు చర్చకు వచ్చాయి. ఈ క్రమంలో చైర్‌పర్సన్‌పై 4వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి చేసిన దురుసు వ్యాఖ్యలతో ఒక్కసారిగా దుమారం రేగింది. నిధులు మంజూరయ్యే విషయాలతోపాటు అత్యవసర టేబుల్ అజెండాలోని అంశాలపై కూడా తమకు తెలుపడం లేదని చైర్‌పర్సన్‌ను కించపరిచేలా 'చైర్మన్ సరిగ్గా లేదు' అని కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడడంతో వివాదం తారస్థాయికి చేరింది. అరగంటపాటు సమావేశంలో ఏ జరుగుతుందో తెలియని గందరగోళం నెలకొంది. నేను సరిగ్గా లేదని ఏ విధంగా మాట్లాడుతావని చైర్‌పర్సన్ శిల్ప నిలదీశారు. మహిళా సభ్యులతో మాట్లాడేతీరు ఇదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా మహిళా కౌన్సిలర్లు కూడా కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి తీరును వ్యతిరేకించారు. ఇరువురి మధ్య కొద్దిసేపు మాటల యుద్ధం కొనసాగింది. అత్యవసర టేబుల్ అజెండా అంశాలు కూడా తనకు అధికారులు అరగంట ముందే తన దృష్టికి తీసుకొచ్చి అనుమతి తీసుకున్నారని, అలాంటప్పుడు తనపై ఏ విధంగా నిందలు వేస్తావని కౌన్సిలర్ తీరును ఎండగట్టారు. పోలీసులు, కొందరు కౌన్సిలర్లు జోక్యం చేసుకుని గొడవను సద్దుమణిగించారు.

నిధుల కేటాయింపుపై అభ్యంతరం

మున్సిపాలిటీలో రూ.3 కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి గత నెలలో వాయిదా పడిన అంశాలను మళ్లీ అజెండాలోకి రావడంతో సమావేశంలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. 28వ వార్డు కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సిఫార్సులకు తాము వ్యతిరేకంగా కాదని, కానీ దాదాపు 14 వార్డులకు పైసా కేటాయించకుండా అన్యాయం చేస్తుండడం సమంజసం కాదన్నారు. చాలా వార్డుల్లో అధిక మొత్తంలో నిధులు కేటాయించడం పట్ల అభ్యంతరం తెలుపుతూ వాయిదా వేయాలని డీసెంట్ జారీ చేశారు. వాయిదా విషయమై టీడీపీ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు కమిషనర్ జోక్యం చేసుకుని రూ.3 కోట్ల నిధుల కేటాయింపులో 9 అంశాలకు సంబంధించి కేటాయించిన రూ.74 లక్షలను కేటాయించని వార్డుల్లో అవసరమైన చోట్ల అభివృద్ధి పనులకు రివైజ్ చేసి చర్యలు తీసుకుంటామని, అప్పటి దాకా తొమ్మిది అంశాలను మినహాయించి అన్నింటినీ ఆమోదించాలని కోరారు. దీంతో అజెండా అంశాలను కౌన్సిలర్లు ఆమోదించారు. దీంతో తాను జారీ చేసిన డీసెంట్‌ను కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులు వెనక్కుతీసుకున్నారు. అనంతరం జరిగిన జీరో అవర్‌లో పలు సమస్యలపై కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తెచ్చారు. సమావేశంలో వైస్ చైర్మన్లు శ్రీనివాస యాదవ్, వలిబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ సురేష్, ఏఈ నరసింహులు, ఎంఈఓ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రేమ ప్రవాహిని రథోత్సవం


కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

బెళుగుప్ప: భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవం నిర్వహించారు. కళ్యాణదుర్గం నుంచి బెళుగుప్పకు చేరుకున్న స్వామి రథానికి బెళుగుప్ప వాసులు, సత్యసాయి మండల కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. చిన్నారుల కోలాటం, భజనల మధ్య రథాన్ని ఊరేగించారు. విశ్వ శాంతి కోసం దేశ వ్యాప్తంగా ఐదు రథాలతో 3.5 లక్షల కిలోమీటర్ల ఆధ్యాత్మిక రథయాత్ర చేపట్టడం జరిగిందని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి జిల్లా అధ్యక్షుడు రామచంద్రమూర్తి, సేవాసమితి మండల అధ్యక్షుడు సాయిరాం, మండల సత్యసాయి సమితి కమిటీ సభ్యులు, శ్రీదివ్య ప్రేమ ప్రవాహిని రథోత్సవ సాయి భక్తులు, సేవాదల్ సభ్యులు, యువత, బాల వికాస్, గురువులు విద్యార్థులు భజన మండళ్ల తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన


రైతులకు సూచనలిస్తున్న ఏఓ శుభకర్

ఉరవకొండ రూరల్: ప్రస్తుతం యూరియా కొరత తలెత్తున్న సందర్భంగా నానో టెక్నాలజీ ద్వారా ఉత్పత్తి చేసిన యూరియా డీఏపీ పంటలకు అనువైనదే అని మండల వ్యవసాయాధికారి రామకృష్ణుడు తెలిపారు. బుధవారం షేక్షానిపల్లి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పంటల్లో వచ్చే చీడపీడల నివారణ గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కలగళ్లలో పొలం పిలుస్తోంది

కూడేరు: మండల పరిధిలోని కలగళ్లలో బుధవారం వ్యవసాయాధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏఓ శుభకర్ ఆముదం పంటను పరిశీలించారు. పంటకు సోకే తెగుళ్లు, వాటి నివారణకు పిచికారీ చేయాల్సిన మందులను వివరించారు. వేరుశనగ పంట సాగుకు అదును దాటిందని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, ఎంపీఈఓ, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగంపై 'కూటమి' నిర్లక్ష్యం


విద్యార్థులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టక రాష్ట్రంలో విద్యారంగంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి నరేంద్ర విమర్శించారు. బుదువారం పట్టణంలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్‌ను ఆయన పార్టీ నేతలతో కలిసి సందర్శించారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందజేసే భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మారుతమ్మ, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మమత సురేష్, సల్ల మారుతి, విద్యార్థి విభాగం రాష్ట్ర నేత షేక్షావలి, మాజీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు నిశాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదర్శ్ రెడ్డి, నాయకులు బిక్కిహరి, గూజనపల్లి నాగరాజు, ఎరుకుల అజయ్, రాజు, ఎస్వి జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం ఆకస్మిక తనిఖీ


మనగ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ముదిగల్లు రోడ్డు వద్ద ఉన్న మనగ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని బుధవారం ఏడీఏ ఎల్లప్ప, ఏఓ శ్రావణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సుమారు రూ.7, 24,400 విలువైన బయోస్టిమిలైట్ అనే ఎరువులను సీజ్ చేశారు. అనుమతులేని ఎరువులు, మందులను రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు దుకాణదారులను హెచ్చరించారు. ఎరువులు. మందులు విక్రయించిన తర్వాత రైతులకు తప్పకుండా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న ఆత్మ పీడీ పద్మలత

కూడేరు: భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగులో ఎరువులు వాడితే పెట్టుబడి ఖర్చు తగ్గి అధిక దిగుబడులు సాధించడానికి అవకాశముంటుందని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మలత తెలిపారు. బుధవారం కూడేరులోని వ్యవసాయ కార్యాలయంలో పంటల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీడీ పద్మలత ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పంటల సాగుపై రైతులకు అవగాహన తప్పనిసరి అన్నారు. నాణ్యమైన విత్తనంతోనే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. రైతులు విత్తన ఎంపికలో జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. పంటకు అవసరమయ్యే పోషకాలతో కూడిన ఎరువులను వాడాలని తెలియజేశారు. పంటకు ఆశించే చీడపీడలను తొలి దశలోనే గుర్తించి మందులు వాడితే తక్కువ ఖర్చుతోనే తెగుళ్లకు అడ్డుకట్ట వేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఏఓ శుభకర్, ఏఈఓలు రాఘవేంద్ర, దిలీప్ కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది నరేష్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

బొమ్మనహాళ్: ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ హెచ్చరించారు. బుధవారం ఉద్దేహాళ్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వ ఉన్న యూరియా ఎరువులు, అమ్మిన వివరాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు ఎమ్మార్పీకే రైతులకు విక్రయించాలన్నారు. ఇష్టారాజ్యంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు అన్ని వివరాలతో కూడిన బిల్లును కచ్చితంగా ఇవ్వాలని ఫర్టిలైజర్ వ్యాపారులను ఆదేశించారు. యూరియా ఎరువులను బ్లాక్ మార్కెట్‌లో అమ్మినా, అధిక ధరలకు విక్రయించినా ఎరువుల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు నానో యూరియా, నానో డీఏపీ వైపు ఆసక్తి చూపాలన్నారు. ఒక రైతుకు మూడు బస్తాలకు మించి ఎరువులను అమ్మరాదని సిబ్బందికి సూచించారు. సొసైటీలో యురియా ఎరువులు అందడం లేదని, యురియా కొరతను తీర్చాలని పలువురు రైతులు జిల్లా వ్యవసాయాధికారి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆమె స్పందిస్తూ ప్రతి రైతుకూ యురియా ఎరువులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సాయికుమార్, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్


మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

రాయదుర్గం: జిల్లాలో నాటుసారా, గంజాయి, కర్ణాటక మద్యం నిర్మూలన కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. బుధవారం ఏఈఎస్ శ్రీరామ్‌తో కలసి రాయదుర్గం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఎస్‌హెచ్ఓ మహేష్‌కుమార్‌తో కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కర్నాటక మద్యం కట్టడితో పాటు గంజాయి, నాటుసారా తయారీ దారులపై ఉక్కుపాదం మోపామన్నారు. కర్ణాటక సరిహద్దున్న ఓబుళాపురం, డొనేకల్లు చెక్ పోస్టులను తరచూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం హెడ్‌కానిస్టేబుల్‌గా పదవీ విరమణ పొందిన సోమశేఖర్‌ను సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. అలాగే ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ సీఐగా పదోన్నతి పొంది ఓబుళాపురం చెక్ పోస్టుకు బదిలీపై వెళ్లిన పవన్‌కుమార్‌ను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సీఐ మహేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం

- 1,812 మందిలో 813 మందికి మాత్రమే అందజేత

రాయదుర్గంటౌన్: వృద్ధులు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వ్యక్తులకు ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ చేయాలన్న ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ డీలర్లు ప్రతి నెలా 26 నుంచి 30 వరకు వృద్ధులు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారి ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాల్సి ఉంటుంది. అంతేకాక ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ నారాయణశర్మ కూడా స్పష్టంగా ఆదేశిస్తూ ఇంటి వద్దకే రేషన్‌ను వంద శాతం అమలు చేయాలని, నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. కానీ డీలర్లు ప్రభుత్వ ఆదేశాలను పెడచెవిన పెడుతున్నారు. రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలో 1,812 మందికి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ ఇవ్వాల్సి ఉంది. కానీ బుధవారం సాయంత్రానికి 813 మందికి మాత్రమే ఇంటికి వెళ్లి రేషన్ పంపిణీ చేసినట్లు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. 44.83 శాతం మందికి మాత్రమే రేషన్ పంపిణీ జరిగింది. ఇప్పటికైనా తహసీల్దార్, సీఎస్‌డీటీ అధికారులు స్పందించి ఇంటి వద్దకే డీలర్లు వెళ్లి రేషన్ పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

ఉరవకొండ రూరల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు. బుధవారం పెద్ద కౌకుంట్లలో పీహెచ్‌ఎసీ వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండ రామిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

డేంజర్


గుంపునాగప్పల కట్ట వద్ద ప్రమాదకరంగా ఉన్న పోల్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 28, 29 వార్డుల పరిధిలో గుంపునాగప్పల కట్ట ఎదురుగా ఉన్నవీధిలో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. చాలా కాలంగా స్తంభం పైభాగం పూర్తిగా విరిగి తీగల సహాయంతో వేలాడుతూ ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేస్తున్నా పట్టించుకోవడం లేదు. వైర్లు తెగపడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ముందుకు పారని మురుగు


బీసీ కాలనీలో చెత్తాచెదారంతో నిండిన కాలువ

గుమ్మఘట్ట: గోనబావి గ్రామంలో దుర్గంధం వెదజల్లుతోంది. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగునీరు ముందుకు వెళ్లడం లేదు. దీంతో దుర్వాసన వస్తోంది. పంచాయతీ అధికారులు ఇటు వైపు రావడంలేదని గ్రామస్తులు చెబుతున్నారు. పారిశుధ్యం లోపించి జనం వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి మురుగు కాలువల్లో చెత్త తొలగించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి కొల్లప్పను వివరణ కోరగా చెత్తను తొలగించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

దోమల కట్టడితో మలేరియా నివారణ


మలాథియాన్ పిచికారీ చేయిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య

కూడేరు: దోమలు వృద్ధి చెందకుండా కట్టడి చేస్తే మలేరియాను అరికట్టొచ్చని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య అన్నారు. కూడేరు మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో ఆగస్టు 1 నుంచి ఎన్‌సీసీ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. సుమారు 750 మంది క్యాడెట్లు పాల్గొననున్నారు. బుధవారం మలేరియా యూనిట్ ఆఫీసర్లు ఎన్‌సీసీ నగర్‌ను సందర్శించారు. క్యాడెట్లు మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా గదుల్లో, పరిసర ప్రాంతాల్లో మలాథియాన్ డబ్ల్యూడీపీ 25 శాతం మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ సూపర్‌వైజర్లు నూర్ బాషా, శ్రీధర్ మూర్తి, మండల సూపర్‌వైజర్ రవీంద్ర, హెల్త్ అసిస్టెంట్ శివప్రసాద్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల బోర్డు, దిమ్మెల ధ్వంసం

వజ్రకరూరు: మండల కేంద్రంలోని కేవీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి బుధవారం మధ్యాహ్న భోజన పథకం బియ్యం బస్తాలతో లారీ ప్రవేశించడంతో ప్రమాదవశాత్తూ పాఠశాల నేమ్ బోర్డు, దిమ్మెలు ధ్వంసం అయ్యాయి. లారీ డ్రైవర్ గమనించక పోవడంతో ఇలా జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

టీడీపీ నేతల అత్యుత్సాహం


వైఎస్సార్ విగ్రహం కనపడకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన టీడీపీ నేతలు

కళ్యాణదుర్గం రూరల్: చాపిరి గ్రామంలో బుధవారం గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పర్యటన సందర్భంగా టీడీపీ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం పక్కన టీడీపీ నేతలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. తీవ్రంగా ఆగ్రహించిన వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యకర్తలు ఫెక్సీలను తొలగించారు. ఇలాంటి రెచ్చగొట్టే పనులు మానుకోవాలని టీడీపీ కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ నేతలు హితవు పలికారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

కళ్యాణదుర్గం రూరల్: సమాజం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి భాను పేర్కొన్నారు. కోర్టు ఆవరణలో జడ్జి మాట్లాడుతూ కొందరు చిన్న పిల్లలను అక్రమ రవాణా చేసి వివిధ వ్యాపారాలకు వాడుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు చిన్నపిల్లలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యుత్ మెటీరియల్ ఇప్పించండయ్యా..


మాట్లాడుతున్న రైతు శ్యాంనాయక్

వజ్రకరూరు: డీడీ కట్టి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యుత్ అధికారులు మెటీరియల్ ఇవ్వడం లేదని మండలంలోని వెంకటాంపల్లి పెద్దతండాకు రైతు శ్యాంనాయక్ ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ మెటీరియల్‌కు రూ.27,960 డీడీ చెల్లించినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు కేవలం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే ఇచ్చారని.. మిగిలిన మెటీరియల్ అందలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ షెక్షావలిని సంప్రదించగా.. త్వరలోనే రైతుకు మెటీరియల్ అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.